
నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, శనివారం 3 ఫిబ్రవరి 2024 | HYDERABAD



## 51 రైళ్లు రద్దు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): మౌలాలి-అమ్ముగూడ-సనత్‌నగర్ స్టేషన్ల మధ్య కొనసాగుతున్న ఎంఎంటీఎస్ ఫేజ్-2 పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే దాదాపు 51 రైళ్లను ఎస్‌సీఆర్ అధికారులు రద్దు చేశారు. 4 నుంచి 11 వరకు టైమ్‌టేబుల్ వారీగా రైళ్ల రద్దు ఉంటుందన్నారు. ఈ క్రమంలో సాధారణ రైళ్లతో పాటు ఎంఎంటీఎస్ సర్వీసులను కూడా రద్దు చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, వికారాబాద్-గుంటూరు, రేపల్లె- సికింద్రాబాద్‌తో పాటు లింగంపల్లి-హైదరాబాద్, లింగంపల్లి-ఉందానగర్, లింగంపల్లి-ఫలక్‌నుమా వంటి పలు స్టేషన్ల మధ్య కూడా టైమ్ టేబుల్ ప్రకారం ఎంఎంటీఎస్‌లను రద్దు చేశామన్నారు.






హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

## రేపు దివ్యాంగులకు ఉచిత స్క్రీనింగ్ శిబిరం

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 2: జీవితం మధ్యలో ప్రమాదవశాత్తు ఏదైనా అవయవం కోల్పోయి దివ్యాంగులుగా మారిన వారు ఇబ్బందులు పడవద్దనే సంకల్పంతో ఈనెల 4న కింగ్‌కోఠిలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉచితంగా స్క్రీనింగ్, డయాగ్నసిస్, ఆర్టిఫిషియల్ లింబ్, కాలిఫర్స్, కొలతల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నారాయణ్ సేవా సంస్థాన్ కో ఆర్డినేటర్ అల్కా చౌదరి, ప్రతినిధులు జస్మీత్ పటేల్, భగవాన్ ప్రసాద్ గౌర్, రితేశ్ జగీర్దార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆవిష్కరించారు. శిబిరం వచ్చే వారు ఆధార్ కార్డు, వైకల్య ధ్రువీకరణ పత్రం, వైకల్యాన్ని తెలిపే రెండు ఫొటోలు తప్పనిసరిగ్గా తీసుకుని రావాలని సూచించారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు ప్రశాంత్ అగర్వాల్, నరేంద్రసింగ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

# ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి?

### హామీల అమలుపై చేతులెత్తేసిన సీఎం రేవంత్

### 'మేడ్చల్' విజయోత్సవ సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మేడ్చల్, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ): ఆరు గ్యారంటీల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి చేతులెత్తాశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తేనే గ్యారంటీలను అమలు చేస్తామంటున్నారని విమర్శించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలో శుక్రవారం జరిగిన మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రజలకు 420 హామీలిచ్చి.. గద్దె నెక్కిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు పనికి వచ్చే పనులు చేయకపోగా పనికి మాలిన మాటలు మాట్లాడుతున్నారన్నారు. దొంగ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 50 నుంచి 60 రోజుల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేత మూటగట్టుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే సమయం తొందరగా వచ్చిందన్నారు. డిసెంబర్ 9న రైతు రుణ మాఫీ చేస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్ ఆ హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారని, వందరోజుల్లో అమలు చేయకపోతే ప్రజల తరపున పోరాడుతామన్నారు.

**బీజేపీని ఆపే సత్తా కాంగ్రెస్‌కు లేదు**

కేంద్రంలో బీజేపీ ఆపే సత్తా కాంగ్రెస్‌కు లేదని, బలమైన ప్రాంతీయ పార్టీల నాయకులు కేసీఆర్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్‌లకు ఉన్నదని కేటీఆర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి చెక్ పెట్టాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరమున్నదన్నారు.

**నేడు కూకట్‌పల్లిలో..**

కేపీహెచ్‌బీ కాలనీ: కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని శనివారం ఎన్‌కేఎన్ ఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు సతీశ్ అరోరా తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

### గులాబీ జెండా ఎగరాల్సిందే

కేంద్రం నుంచి రాష్ట్ర హక్కులను సాధించాలన్నా.. రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలను నిలదీయాలన్నా.. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరాల్సిందేనన్నారు. మన హక్కులు, కృష్ణా జలాల కోసం కొట్లాడుతున్నది బీఆర్ఎస్ ఎంపీలేనని కేటీఆర్ గుర్తు చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర చోడో యాత్రగా మారిందని ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని పరిస్థితిలో ఉందన్నారు. 50 రోజుల్లోనే ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై విసుగు వచ్చిందన్నారు. ఈ విజయోత్సవ సభలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మేయర్ జక్క వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజిగిరి నుంచి కేటీఆర్ పోటీ చేయాలని తీర్మానం..**

కుత్బుల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామంటూ.. కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పార్టీ శ్రేణులు శుక్రవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఎంపీగా కేటీఆర్ పోటీ చేస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీశ్ స్పష్టం చేశారు.





అనారోగ్యంతో బాధపడుతున్న తెలంగాణ ఉద్యమకారుడు శేషు కుమారుడు ప్రదీప్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం పరామర్శించారు. చౌదరిగూడలో జరిగిన విజయోత్సవ సభలో పాల్గొన్న ఆయన..అనంతరం మైసమ్మగుట్టలో ప్రదీప్ నివాసానికి వెళ్లి పలకరించారు. వైద్యం కోసం లక్ష రూపాయల చెక్కును అందజేశారు.

**- ఘట్‌కేసర్, ఫిబ్రవరి 2**

### కలెక్టరేట్ పరిసరాలను
## శుభ్రంగా ఉంచండి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న అన్ని ఆఫీసులు, కలెక్టరేట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిపాలనా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని అన్ని భవనాలు, కార్యాలయాలను కలియ తిరిగారు. ముఖ్యంగా కలెక్టరేట్‌లో పెరిగిపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కార్యాలయంలో విద్యుత్, నీరు, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే వాటి పనులు పూర్తి చేయాలన్నారు.

### వివేకానందుని
## ఆశయ సాధనకు పాటుపడాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 2 : లోయర్ ట్యాంక్‌బండ్‌లోని దోమలగూడ రామకృష్ణ మఠంలో శుక్రవారం స్వామి వివేకానంద 162వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మఠంలోని శ్రీ రామకృష్ణుల విశ్వజనీన దేవాలయంలో సుప్రభాతం, మంగళహారతి, భజన కార్యక్రమాలు, దేవాలయ ప్రదక్షిణలు, విశేష పూజ, భజనలు, హోమం పూజల్లో మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామి వివేకానందుని జీవితంపై బోధమయానంద సందేశం ఇచ్చారు. వివేకానందుని ఆశయసాధనకు యువత పాటుపడాలన్నారు.



రామకృష్ణ మఠంలో స్వామి వివేకానందుని జయంతి వేడుకల్లో పాల్గొన్న స్వామి బోధమయానంద, భక్తులు



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

## ఔటర్ కాలనీలకు.. సమృద్ధిగా జలసిరులు

### మే నెలాఖరులోగా.. 978 కాలనీలకు పుష్కలంగా నీరు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : ఔటర్ రింగు రోడ్డు లోపల 193 గ్రామాలకే కాదు.. ఇక మీదట కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకూ సమృద్ధిగా తాగునీరు అందనున్నది. నగరం నలువైపులా ఆకాశహర్మ్యాలు, గేటెడ్ కమ్యూనిటీలు, భారీ అపార్ట్‌మెంట్లు, విల్లాలతో మినీ నగరాలు రావడం..ఇక్కడి ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా తాగునీటిని అందించే ఉద్దేశంతో రూ. 1200 కోట్లతో ఓఆర్ఆర్ ఫేజ్-2 పనులను కేసీఆర్ ప్రభుత్వం చేపట్టింది. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్, పటాన్‌చెరువు నియోజకవర్గాల్లో రెండు ప్యాకేజీలుగా విభజించి 73 రిజర్వాయర్ల పనులు చేపట్టగా..ఇప్పటికే 23 రిజర్వాయర్లను కేసీఆర్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చి కొన్ని ప్రాంతాల్లో తాగునీటి కష్టాలను దూరం చేసింది. వచ్చే వేసవి నాటికల్లా ఈ పథకం పూర్తి ఫలాలు అందుబాటులోకి రానున్నాయి.

**తుది దశకు పనులు..**

ఓఆర్ఆర్-2 ప్రాజెక్టు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, ఈ వేసవి కల్లా పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఓఆర్ఆర్ ప్రాజెక్టు-2 లోని కిస్మత్‌పూర్, మంచిరేవుల, బైరాగిగూడ, గంధం గూడ, బృందావన్ కాలనీ, ఎర్రకుంట అభ్యుదయ నగర్, గండిపేట్‌లలో నిర్మాణం పూర్తి చేసుకున్న పలు రిజర్వాయర్లను సందర్శించారు. రిజర్వాయర్లలో ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లను ఎండీ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ లైన్లు, కొత్త రిజర్వాయర్ల వల్ల లబ్ధి జరిగే ప్రాంతాల వివరాలను ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న డిస్ట్రిబ్యూషన్ లైన్లు, ఇతర పనులను పూర్తి చేసి ఈ వేసవిలో వంద శాతం నీరు సరఫరా అందించేలా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న రిజర్వాయర్లపై వివరాలతో సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.



## తీరొక్క మొక్కలు చూపు తిప్పుకోనివ్వవు..

*ఇండోర్..క్రోటన్స్ మొదలు కొని.. బోన్సాయిల వరకు.. ఇలా విభిన్న రకాల మొక్కలు.. కుండీలు.. గార్డెనింగ్ వస్తువులతో పీపుల్స్‌ప్లాజాలోని గ్రాండ్ నర్సరీ మేళా ఆకట్టుకుంటున్నది. పచ్చదనం పరుచుకొని.. అందమైన మొక్కలతో ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నది.*



## గొప్ప మనసు చాటి

### సిల్వర్ ఓక్స్ విద్యార్థుల ఔదార్యం

దుండిగల్, ఫిబ్రవరి 2: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లిలోని సిల్వర్‌ఓక్స్ పాఠశాల విద్యార్థులు మరోసారి తమ గొప్ప మనస్సును చాటుకున్నారు. తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీని సేవా కార్యక్రమాలకు వినియోగించారు. ఏకంగా రూ. 24 లక్షల మొత్తాన్ని ఓ రూరల్ డెవలప్ మెంట్ ఫౌండేషన్‌తో పాటు అనాథ ఆశ్రమానికి విరాళంగా అందజేశారు. సిల్వర్‌ఓక్స్ విద్యార్థులు 20 ఏండ్లుగా 'కాయిన్స్ ఫర్ కంట్రీ' పేరుతో తమ పాకెట్‌మనీని జమ చేసి.. ఉమ్మడి వరంగల్ జిల్లా కల్లెడలోని రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్(ఆర్‌డీఎఫ్)కు, అదే సమయంలో ఏపీలోని గుంటూరు జిల్లా నర్సారావుపేటలోని 'నైస్ అనాథ ఆశ్రమానికి' కొంతమొత్తాన్ని విరాళంగా అందజేస్తూ వస్తున్నారు. తాజాగా శుక్రవారం సైతం ఆర్‌డీఎఫ్‌కు రూ.19 లక్షల 36వేలు, నైస్ అనాథ ఆశ్రమానికి రూ.5 లక్షలను ఆయా సంస్థల ప్రతినిధులకు పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు ధనుంజయ, నీలిమ, ఆర్‌డీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు వందితారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




ఆర్‌డీఎఫ్ ప్రతినిధులు వందితారావు, కిరణ్‌లకు విరాళాన్ని అందజేస్తున్న సిల్వర్‌ఓక్స్ పాఠశాల డైరెక్టర్లు ధనుంజయ, నీలిమ



## కమిషనర్‌కు కౌన్సిల్ ఇష్టం లేదు

**సర్వసభ సమావేశం నిర్వహించాలని కోరినా.. స్పందన లేదు**

**కమిషనర్ వైఖరిపై సర్కారు జోక్యం చేసుకోవాలి**

**బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్ల డిమాండ్**

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్, బీజేపీ పార్టీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. కమిషనర్ ఏకపక్ష నిర్ణయం తీసుకుంటున్నారని బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ మండిపడ్డారు. చట్టసభలు పెట్టాలంటే కోర్టును కోరాల్సి రావడం దౌర్భాగ్యమన్నారు. గ్రేటర్‌లో ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుక్కకాటు, నాలా పనుల నిర్లక్ష్యం, ఇంజినీరింగ్ పనుల్లో నిర్లక్ష్యం, అవినీతి అధికారుల రాజ్యం కొనసాగుతున్నదని మండిపడ్డారు. ఏండ్ల తరబడి జీహెచ్ఎంసీలోనే డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారన్నారు. శాఖల మధ్య సమన్వయం లేకపోవడంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కమిషనర్‌కు కౌన్సిల్ ఇష్టం లేదని, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సమావేశం పెట్టాలని చెప్పినా.. కమిషనర్ కావాలనే సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయడం లేదని బీఆర్ఎస్ కార్పొరేటర్ మహాలక్ష్మి ఆరోపించారు. మేయర్‌కు కమిషనర్ కనీసం గౌరవం ఇవ్వడం లేదన్నారు. కమిషనర్ రోనాల్డ్ రాస్ వైఖరిపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

